# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 01 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 342

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD








# అరుదైన రాజనీతిజ్ఞుడు

భారత మాజీ ఉప రాష్ట్రపతి, రాజనీతిజ్ఞుడు వెంకయ్య నాయుడికి ఆదివారంతో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం జీవించాలని కోరుకుంటున్నా.

### అమ్మ పేరిట మొక్క

'అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి (ఏక్ పేడ్ మా కే నామ్)' అని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తద్వారా వన మహోత్సవానికి ఊతమివ్వాలని కోరారు.

ప్రతి ఒక్కరూ నాటండి

### భూమాతను రక్షించండి

ప్రధాని మోదీ పిలుపు

మూడోసారి బాధ్యతలు చేపట్టాక తొలి

'మన్ కీ బాత్'



# హైదరాబాద్ నగరంలో పలు చోట్ల భారీ వర్షం

హైదరాబాద్ :నగరంలో గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ కూడా నగరంలోని పలు ప్రాంతాలు భారీ వర్షంతో తడిసి ముద్దయ్యాయి.జూబ్లీహిల్స్ , కూకట్ పల్లి, బేగంపేట, కేపీహెచ్ బీ కాలనీ, దిల్ సుఖ్ నగర్, ప్రగతి నగర్, హైదర్ నగర్, బోయిన్ పల్లి, నిజాంపేట్, మైత్రీవనం, యూసఫ్ గూడ, పంజాగుట్ట, బోరబండ, ఉప్పల్, ఎల్బీనగర్, రామంతపూర్, హయత్ నగర్, తిరుమలగిరి, ఎల్బీనగర్, బొల్లారం, అమీర్ పేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగింది.

# న్యాయ వ్యవస్థలో మార్పులు రావాలి




**హైదరాబాద్:** దేశ న్యాయవ్యవస్థలో మార్పులు రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పేదలు సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయం అడిగే పరిస్థితి ఉందా.. అన్న అంశంపై చర్చ జరగాలన్నారు. దేశ ప్రజలు, సమాజ హితం కోసం కేంద్రం కొత్త నేర న్యాయ చట్టాలను తీసుకొచ్చిందని.. ప్రధాని మోదీపై కోపంతో వాటిని కొందరు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఏం చేసినా వ్యతిరేకించడమే వారి పని అని విమర్శించారు. తాను 2019లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కొత్త నేర న్యాయ చట్టాలపై చాలా పనిచేసినట్లు చెప్పారు. 'ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్' ఆధ్వర్యంలో కొత్త నేర న్యాయ చట్టాలపై హైదరాబాద్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ న్యాయ కళాశాలలో ఆదివారం కార్యశాల ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి కొత్త చట్టాల సారాంశంతో భరత్ గోగియా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించి.. మాట్లాడారు. "దేశంలో వస్తున్న మార్పులు, కొత్తగా నమోదవుతున్న నేరాలు, ప్రజల ఆలోచనా విధానానికి అనుగుణంగా చట్టాలు రావాల్సిన అవసరముంది. నేర న్యాయ చట్టాల విషయంలో విశ్వవిద్యాలయాల వీసీలు, ఐపీఎస్ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రజలు, స్వతంత్ర సంస్థలు సహా అనేక రంగాల వారి నుంచి వేల అభిప్రాయాలు స్వీకరించి.. కమిటీ ఏర్పాటు చేశాం. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే కొత్త చట్టాలు వచ్చాయి. కేంద్రం సదుద్దేశంతో తెచ్చిన చట్టాల్లో పొరపాట్లుంటే సలహాలివ్వాలి. భేషజాలకు పోకుండా మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబరు 17న అధికారికంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేయకపోయినా కేంద్రం కొనసాగిస్తుంది. త్వరలో రాష్ట్రంలో అధికారంలోకొస్తే అధికారికంగా నిర్వహిస్తాం" అని కిషన్‌రెడ్డి వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు తెచ్చిన నేర న్యాయ చట్టాల స్థానంలో కొత్తవి తెస్తే కొన్ని రాష్ట్రాలు బంద్ పాటించడం సరికాదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు.




# ఆయన కృషి మరువలేనిది

పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని.. ఆయన కృషి మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

# 10 మంది విద్యార్థులు మించితే.. ఇద్దరు టీచర్లు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది విద్యార్థులు దాటిన చోట ఇక ఇద్దరు ఉపాధ్యాయులు రానున్నారు. 41 మంది పిల్లలు మించితే ముగ్గురు టీచర్లు ఉంటారు.పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపుఎస్జీటీ బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ నిర్ణయంపాక్షికంగా హేతుబద్ధీకరణ అమలు చేసినట్లే..!



**హైదరాబాద్:** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది విద్యార్థులు దాటిన చోట ఇక ఇద్దరు ఉపాధ్యాయులు రానున్నారు. 41 మంది పిల్లలు మించితే ముగ్గురు టీచర్లు ఉంటారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల సందర్భంగా పాఠశాల విద్యాశాఖ తీసుకున్న తాజా నిర్ణయం ఇది. 2015, 2021లలో ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ మార్గదర్శకాల ప్రకారం.. 19 మంది విద్యార్థులు దాటితేనే ఇద్దరు టీచర్లను కేటాయించాలి. అయితే, విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా 10 మంది పిల్లలకు మించి ఉన్నా ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని తాజాగా నిర్ణయించారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అలా కేటాయించకున్నా సర్కారు ప్రస్తుతం తీసుకున్న నిర్ణయంతో చదువుల పరిస్థితి కొంత మెరుగవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం..

పిల్లల సంఖ్య ప్రకారం ఉపాధ్యాయులను హేతుబద్ధీకరించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం 2015లో జీఓ 17, 2021లో జీఓ 25 జారీ చేసింది. ఆ ప్రకారం 0-19 మంది పిల్లలకు ఒక టీచర్, 20-60కి ఇద్దరు, 61-90కి ముగ్గురు, 91-120కి నలుగురు, 121-150కి అయిదుగురు, 151-200కి ఆరుగురు, 201-240కి ఏడుగురు, 241-280 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులను కేటాయించారు. 361-400 మంది విద్యార్థులకు ఏకంగా 11 మంది టీచర్లు ఉంటారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇది అమలు జరగడం లేదు.తాజా బదిలీల్లో ఇలా..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో 2015లో టీచర్ల హేతుబద్ధీకరణ చేశారు. అంటే పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించారు. తర్వాత 2021లో కొత్త మార్గదర్శకాలు ఇచ్చినా ఆ ప్రక్రియ కొనసాగలేదు. ప్రస్తుతం పిల్లలున్న చోట టీచర్లు లేరు.. ఉపాధ్యాయులు ఉన్న చోట పిల్లలు తక్కువగా ఉన్నారు. దీంతో తాజా బదిలీల్లో కొంత మార్పు తీసుకురావాలని విద్యాశాఖ నిర్ణయించింది. అందుకే ఈ సారి ఒక్క విద్యార్థి కూడా లేని బడులకు టీచర్లను ఇవ్వలేదు. 1-10 మంది ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11-40 వరకు ఇద్దరు, 41-60 వరకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా ఖాళీలు చూపారు. ఆ ప్రకారం 10 మంది విద్యార్థులు

ఉన్న పాఠశాలలో ప్రస్తుతం ఇద్దరు పనిచేస్తుంటే ఒక్క ఖాళీనే చూపారు. 11 మంది ఉన్న చోట ఒక్కరే పనిచేస్తుంటే రెండో టీచర్‌ను ఇచ్చేలా ఖాళీ చూపారు.




# ఈ మధ్యే పుట్టిన కొత్త కొత్త దేశాలేవో తెలుసా?

ప్రపంచవ్యాప్తంగా అంతర్యుద్ధాలు, స్వేచ్ఛ, సమానత్వం కోరుకునే ప్రాంతాల్లో తిరుగుబాట్లతో కొత్త కొత్త దేశాలు ఏర్పడుతూ ఉన్నాయి. నిజానికి రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాతి 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు పరాయి పాలన నుంచి విముక్తి పొంది కొత్త దేశాలుగా ఏర్పడ్డాయి. అనంతరం కూడా వివిధ పరిస్థితులతో కొత్త దేశాలు పుడుతున్నాయి. అందులోనూ ఆఫ్రికా, యూరప్ ఖండాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. అలా ఈ మధ్య పుట్టిన కొత్త దేశాలేవంటే..సూడాన్ దేశం ఎన్నో దశాబ్దాల పాటు కొనసాగిన అంతర్యుద్ధంతో.. 2011 జులై 9న దక్షిణ సూడాన్ ఏర్పాటైందిసెర్బియా దేశం నుంచి 2008 ఫిబ్రవరి 17న కొసావో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. అయితే దానికి ఇంకా ప్రపంచవ్యాప్త గుర్తింపు రావాల్సి ఉంది.మొదట్లో సెర్బియా అండ్ మాంటెనెగ్రో యూనియన్ ఆఫ్ స్టేట్ గా ఉండేవి. 2006లో జరిగిన రెఫరెండం ద్వారా మాంటెనెగ్రో, సెర్బియా రెండూ కొత్త దేశాలుగా ఏర్పాటయ్యాయి.ఇండో నేషియా నుంచి 2002 మే 20న ఈస్ట్ తైమూర్ స్వాతంత్ర్యం పొంది కొత్త దేశంగా ఏర్పాటైంది.అమెరికా వలస స్థావరంగా ఉన్న పలావ్.. 1994 అక్టోబర్ 1న ప్రత్యేక దేశంగా స్వాతంత్ర్యం పొందింది.



# అరుదైన రాజనీతిజ్ఞుడు





భారత మాజీ ఉప రాష్ట్రపతి, రాజనీతిజ్ఞుడు వెంకయ్య నాయుడికి ఆదివారంతో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం జీవించాలని కోరుకుంటున్నా. అంకిత భావం, ఆశావాదం, దృఢ చిత్తంతో ప్రజా సేవ చేస్తున్న నాయకుడి జన్మ దినాన్ని జరుపుకోవడం పండగ లాంటిదే. రాజకీయ రంగ ప్రవేశం నుంచి ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించేదాకా సాగిన ఆయన రాజకీయ జీవితం.. భారత రాజకీయాల్లోని సంక్లిష్టతలను హుందాగా, సులువుగా అధిగమించడంలో ఆయనకుగల అరుదైన సామర్థ్యాన్ని మన ముందుంచుతుంది. తన వాగ్ధాటి, చతురత, ప్రగతి సంబంధిత అంశాలపై దృఢ వైఖరి వంటి సుగుణాలు పార్టీలకు అతీతంగా ఆయనకు ఎనలేని గౌరవం తెచ్చిపెట్టాయి.

దశాబ్దాల అనుబంధం

వెంకయ్య నాయుడితో నా అనుబంధం దశాబ్దాల నుంచి కొనసాగుతోంది. మేము కలిసి పని చేసినప్పుడు ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఆయన జీవితంలోని సార్వత్రిక అంశం ఏదైనా ఉందంటే అది ప్రజలపై ప్రేమే. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి సంఘ రాజకీయాల ద్వారా ఆయనలోని ఆచరణాత్మకత, క్రియాశీలత వెలుగులోకి వచ్చాయి. వెంకయ్య నాయుడి అపూర్వ ప్రతిభ, వాక్పటిమ, నిర్వహణా నైపుణ్యంరీత్యా ఏ రాజకీయ పార్టీ అయినా ఆయనకు స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉంటుంది. అయితే 'దేశమే ప్రథమం' అనే దార్శనికత నుంచి స్ఫూర్తి పొందిన ఆయన సంఘ్ పరివార్‌తో కలిసి పని చేయడానికే మొగ్గు చూపారు. ఆ విధంగా ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలతో ఆయనకుగల అనుబంధం తర్వాతి కాలంలో జనసంఘ్, భాజపాల బలోపేతానికి ఎంతగానో దోహదం చేసింది.

ఎమర్జెన్సీలో చురుకైన పాత్ర

49 ఏళ్ల కిందట ఎమర్జెన్సీ విధించిన వేళ.. దానిని వ్యతిరేకిస్తూ మొదలైన ఉద్యమంలో చురుకైన పాతికేళ్ల యువకుడిగా వెంకయ్య నాయుడు ముందుకు దూకారు. ఆ క్రమంలో లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించిన పాపానికి ప్రభుత్వం ఆయనను జైలు పాల్జేసింది. ప్రజాస్వామ్యంపై ఈ నిబద్ధత ఆయన రాజకీయ జీవితంలో పలుమార్లు రుజువైంది. మహా నేత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బర్తరఫ్ చేసిన సందర్భంలోనూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ఆయన మరోసారి ముందు వరుసలో నిలిచారు.

ప్రభంజనాన్ని తట్టుకుని..

వెంకయ్య నాయుడు ఎలాంటి ఆటుపోట్లనైనా అవలీలగా అధిగమించగల సమర్థుడు. ఏపీ శాసనసభ ఎన్నికల సందర్భంగా 1978లో ప్రజలు కాంగ్రెస్‌కు అఖండ విజయం కట్టబెట్టినా జనతా పార్టీ అభ్యర్థిగా ఉదయగిరి నుంచి యువ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అటుపైన ఐదేళ్లకు (1983) ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ తొలి ఎన్నికల్లోనే సునామీ తరహా ఫలితాలతో రాష్ట్రాన్ని చుట్టబెట్టినా ఆయన వరుసగా రెండోసారి అదే స్థానం నుంచి భాజపా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భాజపా ఎదుగుదలకు బాటలు వేశారు.

కార్యదక్షుడు

వెంకయ్య నాయుడి ప్రసంగం విన్న వారంతా సాధారణంగా ఆయన వాక్పటిమకు పెద్దపీట వేస్తారు. అయితే ఆయన వాక్చతురుడు మాత్రమే కాదు... కార్యదక్షుడు కూడా. యువ ఎమ్మెల్యేగా శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన రోజుల నుంచీ సభా వ్యవహారాలను ఔపోసన పట్టిన ఆయనలోని నేర్చుకునే గుణం, నియోజకవర్గ ప్రజాగళం వినిపించడంలో చూపిన అంకిత భావం అపార గౌరవం సముపార్జించి పెట్టాయి. ఆయన ప్రతిభను గుర్తించిన ఎన్టీఆర్ తమ పార్టీలో చేర్చుకోవాలని ఉవ్విళ్లూరారు. కానీ తన మాతృ సిద్ధాంతాన్ని వీడబోనంటూ ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామగ్రామానా పర్యటించి ప్రజలతో మమేకమవుతూ భాజపాను బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ అధ్యక్షుడయ్యారు. భాజపా కేంద్ర నాయకత్వం 1990లలో ఆయన కృషిని గుర్తించింది. ఆ తర్వాత 1993లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఆనాటి నుంచీ జాతీయ స్థాయిలో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. మా పార్టీని అధికారంలోకి తేవడంతోపాటు దేశానికి తొలి భాజపా ప్రధానమంత్రి నాయకత్వం వహించేలా ప్రధాన కార్యదర్శి హోదాలో విశేష కృషి చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థాయికి ఎదిగారు.

కేంద్ర ప్రభుత్వంలో..

వెంకయ్య నాయుడిని కేంద్ర మంత్రి మండలిలోకి తీసుకునేందుకు 2000 సంవత్సరంలో వాజ్‌పేయీ ఆసక్తి చూపారు. ఆ సందర్భంగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు తాను అత్యంత ప్రాధాన్యం ఇస్తానని ఆయన తెలిపారు. తానొక రైతు బిడ్డనని, తన బాల్యమంతా గ్రామాల్లోనే గడిచింది కాబట్టి మంత్రిగా తాను కోరుకునేది ఏదైనా ఉందంటే అది గ్రామీణాభివృద్ధేనని వివరించారు. అందుకు తగినట్లుగానే 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన'వంటి పథకానికి రూపకర్తగా ప్రధాన పాత్ర పోషించారు. 2014లో దిల్లీ వచ్చే నాటికి దాదాపు 15 సంవత్సరాలపాటు గుజరాత్ బాధ్యతలు చూసిన నేను జాతీయ రాజధానికి కొత్త వ్యక్తిని. అటువంటి సమయంలో వెంకయ్య నాయుడి సలహాలు, సూచనలు నాకెంతో ఉపయుక్తమయ్యాయి. పార్లమెంటు నియమ నిబంధనలను పాటించడంలో అధికార, విపక్షాలనే తేడాలేకుండా కచ్చితత్వం అనుసరించడం ఆయనకే చెల్లు. మా కూటమి ప్రభుత్వం 2017లో వెంకయ్య నాయుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించింది.

అయితే ఆయనకుగల మహోన్నత స్థానాన్ని భర్తీ చేయడం ఎలాగన్న సందిగ్ధంలో పడ్డాం. మరోవైపు ఉపరాష్ట్రపతి పదవికి ఆయనను మించిన ఉత్తమ అభ్యర్థి మరొకరు లేరన్న వాస్తవం కూడా మాకు తెలుసు. ఈ నేపథ్యంలో ఎంపీగా, మంత్రిగా తన పదవులకు రాజీనామా చేస్తూ ఆయనిచ్చిన ఉపన్యాసాల్లో ఒక్క అక్షరం కూడా నేను మరువలేను. ఉపరాష్ట్రపతి అయ్యాక ఆ పదవికి మరింత విలువను ఆపాదించే అనేక చర్యలు తీసుకున్నారు. యువ, మహిళా, నూతన ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించడంద్వారా రాజ్యసభకు అత్యుత్తమ ఛైర్‌పర్సన్‌గా నిలిచారు.

ఇప్పటికీ ప్రజా జీవితంలో చురుగ్గా..

వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన తర్వాతా ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటున్నారు. తనకు ఆసక్తిగల అంశాలపై, దేశవ్యాప్తంగా వివిధ పరిణామాలపై ఆయన అప్పుడప్పుడూ ఫోన్‌ద్వారా నన్ను వాకబు చేస్తుంటారు. మా ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇటీవలే నేను ఆయనను కలిశాను. ఆయనెంతో సంతోషంతో నాకు, నా బృందానికి శు భాకాంక్షలు తెలిపారు.

ఇలాంటి తీపి జ్ఞాపకాలతో వెంకయ్య నాయుడు 75 ఏళ్ల మైలురాయిని చేరడంపై మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. యువ కార్యకర్తలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రజా సేవాభిలాషులైన ప్రతి ఒక్కరూ ఆయన జీవితానుభవాల వెలుగులో విలువలను అందిపుచ్చుకోగలరని ఆశిస్తున్నాను. ఆయనవంటి అరుదైన నాయకులే మన దేశాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతూ ఉత్తేజమిస్తున్నారు.

# అప్పులకు పరిష్కారం ఎలా ?

ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా రాజధాని అన్నది ఓ తలకాయ లాంటిది. అది లేకుంటే తలలేదనే చెప్పాలి. అందుకే జగన్ తలకాయ లేని పనులన్నీ చేశారు. అప్పులను చేసి హాయిగా ఉన్నారు. 14 లక్షల కోట్ల అప్పు ఇప్పుడు ఎపి నెత్తిన పడింది. అంటే ఇది సామాన్యమైన అప్పుకాదు. తెలంగాణలోనూ ఇలాంటి పనే చేసి కెసిర్ 7లక్షల కోట్ల అప్పులు పెట్టారు. ఈ ఇద్దరు చేసిన నిర్వాకం కారణంగా ఇరు తెలుగు రాష్ట్రాలు 21 లక్షల కోట్ల అప్పులను మోయాల్సి వస్తోంది. ఇలా అప్పులు చేసి వదిలి వెళ్లిన వారిని వదిలేయడం సమంజసమా అన్నది ప్రజలు ఆలోచించాలి. కేంద్రం ఆలోచించాలి. పార్టీలు ఆలోచించాలి. ఇలా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన వారిని ఏం చేయాలన్నది చర్చించాలి. అప్పులో ఆస్తులు కూడా బెట్టామని బొంకిన మాజీ సిఎంలను ప్రజాక్షేత్రంలో నిలబెట్టాలి. ఎవరు అప్పులు చేసినా వారిని బోను ఎక్కించా ల్సిందే. దక్షత లేకుండా చేసిన పాలన కారణంగా ప్రజలు నష్టపోయారు. వీరు బాగుపడ్డారు. ఇకపోతే ఎపిలో అయితే మరీ దారుణంగా అప్పులు చేశారు. రాజధాని అన్నది కూడా లేకుండా చేశారు. జగన్ పాలనా పగ్గాలు చేపట్టిన ఐదేళ్లలో అప్పులు తప్ప ఒక్క మంచి పనీ చేయాలేదు. మళ్లీ తాను అధికారంలోకి వస్తానన్న ధీమాలో రుషికొండపై అద్దాల మేడలు కట్టుకున్నారు. మరోమారు తాను సిఎం అన్న ధీమాలో ఆయన పాలన సాగించారు. రాజధాని లేకుండా...మూడు రాజధానులు అంటూ ఊరించి ఐదేళ్లకాలం గడిపారు. ఈ ఐదేళ్లలో అటు అమరావతి కానీ..ఇటు వైజాగ్ కానీ రాజధానిగా చేయలేకపోయారు. కానీ మోయలేనంతగా అప్పులు మాత్రం చేశారు. రాజధానితో ఆపటు పోలవరం ప్రాజెక్టును, అభివృద్ధి కార్యక్రమాలను కోల్డ్ స్టోరేజికి ఎక్కించారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అమరావతిపై స్పష్టత లేకుండా పాలన సాగించారు. ఇలా రాజధాని లేకుండా పాలన చేయొచ్చని నిరూపిచారు. తన పట్టుదలలో ఇసుమంతయినా సడలింపు లేకుండా సాగారు. దీనిని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది ఎన్నికల్లో తేల్చి చెప్పారు. 151 సీట్లలో మధ్యలో 5ను లాగేసి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఆయన ఆత్మపరిశీలన చేసుకోకుండా ఇవిఎంలను తప్పుపడుతున్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందాన కెసిఆర్, జగన్‌ల తీరు ఉంది. రాష్ట్ర విభజన నాటి నుండి రాజధానిని ఎక్కడ నిర్మించాలనే సమస్య మొదలైంది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా అవకాశం ఉన్నా ..చంద్రబాబు ఇక్కడినుంచి వదిలి వెళ్లారు. దీంతో అమరావతి కోసం నానా కష్టాలు పడ్డారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా చేపట్టిన అమరావతిలో అసలు నిర్మాణాలు జరగలేదని, డబ్బు వృధా చేశారన్న వాదనలు ముమ్మరం చేశారు. నవ్యాంధ్ర మొదటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికైన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతుల నుండి వేల ఎకరాలు సమికరించారు. పలు నిర్మాణాలు చేపట్టినా, పూర్తి చేయడంలో నిధుల కొరత కారణంగా అసెంబ్లీ, సచివాలయం తదితర నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో నిర్మాన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈలోపు జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పదవి చేపట్టిన నాటి నుండి రాజధానిని తరలిస్తారనే వాదన బలంగా వినిపించారు. అనుకున్నట్లే ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, ప్రాజెక్టులలో అవకతవకలు జరిగాయని ప్రాథమిక నివేదిక అందించింది. దీంతో రాజధాని తరలింపు తప్పదని స్పష్టం చేశారు. దీనికితోడు ఇక్కడ సేకరించిన భూముల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి సమస్యను మరింత జఠిలం చేయాలని చూశారు. అప్పటికే రాజధాని నిర్మాణాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కేంద్ర సహకారం అంతంత మాత్రమే. అసలే నిధుల లేమితో కొట్టు మిట్టాడుతున్న రాష్ట్రం మళ్లీ రాజధానిని తరలిస్తే ఎంత నష్టపోతుందో ముఖ్యమంత్రి జగన్ గ్రహించ లేదు. అందుకే మూడు రాజధానాలు పేరుతో ఐదేళ్ల కాలం గడిపేశారు. రాజకీయ లబ్ది కోసం తడవకోసారి రాజధాని మార్చుకుంటూ పోతే రాష్ట్రం అథోగతి పాలవుతుందన్న విమర్శలు వచ్చినా ఆనాటి సిఎం జగన్ గుర్తించ లేదు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు రాజధాని, పోలవరం నిర్మాణాల కోసం బాగానే కష్టపడ్డారు.న ూష్ట్ర సమగ్ర అభివృద్ధికి జలవనరులు దోహద పడతాయి. గోదావరి నదీ జలాలతో రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయవచ్చు. విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం గట్టిగానే పనిచేసింది. అయితే రూ.33 వేల కోట్లతో చేయవలసిన పునరావాస పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వివరించి, పునరావాసం తో సహా ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉన్నా ఐదేళ్లలో కూడా పూర్తి చేయించలేదు. నదీజలాలు ఉన్నా వాడుకునే వ్యూహాలు కానరాలేదు. తాజాగా ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు కనుక గోదావరి నదీ జలాలను కృష్ణానదికి తరలింపుపై నిపుణులతో, అఖిల పక్షాలతో చర్చించిన తరువాత నిర్ణయాలు చేయాలి. ఉత్తరాంధ్రాలో వంశధార, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ప్రకాశం జిల్లాకు ప్రాణప్రదమైన వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. 1956లో ఏర్పడిన ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిని హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం చేశారు. ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ఐ.టి పరిశ్రమలు, కేంద్ర కార్యాలయాలన్నీ హైదరాబాదు లోనే అభివృద్ధి చేశారు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధాని పేరుతో కేంద్రీకరణకు పూనుకున్నది. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూసమీకరణ, నవ నగరాల నిర్మాణ ఆలోచనలు, సింగపూర్ కంపెనీలతో స్టార్టప్ ఒప్పందం, స్విస్ ఛాలెంజ్ పద్ధతి, ప్రైవేటు సంస్థలకు భూముల కేటాయింపు మొదలైన చర్యలన్నీ చకచకా చేశారు. ఈ క్రమంలో ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాయలసీమలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించి, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఇతర జిల్లాలలో కూడా అనేక ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం, పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజన ప్రాంతం, కృష్ణా జిల్లాలో ఎ. కొండూరు, గంపల గూడెం వంటి ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. విభజన చట్టంలో చెప్పిన విధంగా కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం/ రామాయ పట్నం ఓడరేవు ప్రభుత్వ రంగంలో నిర్మాణం జరగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి.

# ఆయన కృషి మరువలేనిది




నిజామాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని.. ఆయన కృషి మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డి.శ్రీనివాస్ నివాసంలో ఆయన పార్థివదేహంపై సీఎం పుష్పగుచ్ఛం ఉంచి.. నివాళులర్పించారు. డి.శ్రీనివాస్ కుమారులు ఎంపీ అర్వింద్, సంజయ్ సహా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. డి.శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచి రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలక నేతగా కొనసాగారన్నారు. 2004లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో ఎంతో కృషి చేశారని.. 2009లోనూ ఆయన సారథ్యంలోనే పార్టీకి మళ్లీ అధికారం దక్కిందని గుర్తుచేశారు. పార్లమెంటులో డి.శ్రీనివాస్‌ను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించేవారని చెప్పారు. ఆయన మరణం కాంగ్రెస్‌కు తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. చనిపోయాక తనపై కాంగ్రెస్ జెండా కప్పాలనేది ఆయన కోరిక అని, అందుకే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సహా ముఖ్య నేతలను పంపి.. దాన్ని నెరవేర్చామని చెప్పారు. ఆయన ప్రజలకు అందించిన సేవలు గుర్తించి.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. డి.శ్రీనివాస్ మృతికి అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలు సంతాపం తెలిపారన్నారు. ఆయన గౌరవం ఇనుమడించేలా, ప్రజలు, అభిమానులు సేవలను గుర్తుంచుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు. కుటుంబ సభ్యులతో చర్చించాక.. ఆయన జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయిస్తామన్నారు. డీఎస్ పార్థివదేహానికి కాంగ్రెస్ ఎంపీ సురేశ్(కేరళ) నివాళులు అర్పించారు. అనంతరం నిజామాబాద్‌లో అంతిమయాత్ర చేపట్టారు. నగర శివారులోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. డి.శ్రీనివాస్ చితికి పెద్ద కుమారుడు సంజయ్ నిప్పంటించారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మధుయాస్కీగౌడ్, వీహెచ్, లగడపాటి రాజగోపాల్‌లు.. డి.శ్రీనివాస్‌కు నివాళులు అర్పించారు.

# టీమిండియాకు రూ.125 కోట్ల నజరానా ప్రకటించిన బీసీసీఐ కార్యదర్శి జై షా

ఐసీసీ టైటిళ్ల కరవు తీర్చుతూ టీమిండియా టీ20 వరల్డ్ కప్-2024లో విజేతగా నిలిచింది. రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా ఈ టోర్నీలో చాంపియన్స్ గా అవతరించడం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా, బీసీసీఐ కార్యదర్శి జై షా టీమిండియాకు రూ.125 కోట్ల భారీ నజరానా ప్రకటించారు. ఈ విషయాన్ని జై షా స్వయంగా వెల్లడించారు. ఈ టోర్నీ ఆసాంతం టీమిండియా అద్భుతమైన ప్రతిభ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి కనబర్చిందని కొనియాడారు. ఆటగాళ్లందరికీ, కోచింగ్ సిబ్బందికి, ఇతర సహాయక సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని జై షా పేర్కొన్నారు. టీమిండియాకు రూ.125 కోట్ల నజరానా ప్రకటించడానికి ఎంతో సంతోషిస్తున్నానని తెలిపారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS







# జన హృదయ నేతకు అశ్రు నివాళి

































**జనసంద్రంగా మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ అంతిమయాత్ర**

**నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

**ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**

**పర్యవేక్షించిన కలెక్టర్, డీఐజీ, సీపీ**

**శ్రద్ధాంజలి ఘటించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 30**

తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంతో జన హృదయ నేతగా పేరొందిన మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ కు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో డీ.శ్రీనివాస్ కుటుంబీకులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రగతినగర్ లోని డీ.శ్రీనివాస్ నివాస గృహం నుండి బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు అశేష జనవాహిని అంతిమ యాత్రలో పాల్గొని డీఎస్ కు అశ్రు నివాళులర్పించారు.

హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ నుండి కాన్వాయ్ లో రోడ్డు మార్గం గుండా ప్రగతినగర్ లోని డీ.శ్రీనివాస్ నివాసానికి చేరుకుని పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, రాకేష్ రెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణ, శాసన మండలి సభ్యులు జీవన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, నగర మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, అధికారులు, అనధికార ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు డీ.శ్రీనివాస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీఐజీ సుధీర్ బాబు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఇతర ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొని డీఎస్ పార్థీవదేహం పై పుష్పగుచ్ఛాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ కుటుంబ సభ్యులైన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, మాజీ మేయర్ డీ.సంజయ్ తదితరులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

కాగా, డీ.శ్రీనివాస్ అంతిమ యాత్రలో వేలాది మంది అభిమానులు పాల్గొనడంతో రహదారి జనసంద్రంగా మారింది. డీ.శ్రీనివాస్ అమర్ హై...శీనన్న అమర్ హై నినాదాలు హోరెత్తాయి. వేలాదిమంది అంతిమ యాత్రలో పాల్గొని జన హృదయ నేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వద్ద డీ.శ్రీనివాస్ మృతదేహానికి అధికార లాంఛనాలతో నివాళు లర్పించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియల్లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వేల సంఖ్యలో అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

**డీఎస్ మరణం తీరని లోటు :సీఎం రేవంత్ రెడ్డి**

మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ మరణం తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీఎస్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించిన సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాజకీయాలలో సుదీర్ఘ అనుభవం కలిగిన డీ.శ్రీనివాస్ ఉమ్మడి రాష్ట్రంలో కీలక నేతగా కొనసాగారని గుర్తు చేశారు. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి డీఎస్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులోనూ డీ.శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారని, ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వపరంగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందన్నారు. డీఎస్ గౌరవం ఇనుమడించేలా, ఆయనను ప్రజలు, అభిమానులు ఎల్లవేళలా గుర్తుంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

డీ.శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించుకుని, వారితో చర్చించిన మీదట డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డీఎస్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అన్నారు.